క్లుప్తంగా

బాట్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



దాడితోటలో పూజలందుకుంటున్న బాట్లమ్మ తల్లి

తాడిమర్రి: దాడితోట గ్రామంలో చిత్రావతి నది ఒడ్డున వెలసిన బాట్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్ప మాలలతో అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపు



కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపును అందిస్తున్నామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గూడూరు మోహన్ దాస్, కార్యదర్శి రాజగోపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరం దాతలుగా కాచర్ల హనుమంతు జ్ఞాపకార్థం కుమారుడు కాచర్ల నాగరాజు వ్యవహరించారు. శిబిరంలో 85 మందికి కంటిపరీక్షలను చేయగా 50 మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. లయన్స్‌క్లబ్ కోశాధికారి వేణుగోపాలాచార్యులు, సభ్యులు మెటికల కుళ్లాయప్ప, శాగా సురేష్, రాధాకృష్ణ, ఉట్టి శివప్రసాద్, కొత్తపాలెం కుమార్, చందా నాగరాజు, రమేష్‌బాబు, నాగేంద్ర పాల్గొన్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అమడగూరు: అమడగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మాతృశ్రీ వృద్ధాశ్రమ ఆధ్వర్యంలో బెంగుళూరు సప్తగిరి ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 200 మందికి కిడ్నీస్టోన్స్, బీపీ, షుగర్, ఎకో, ఈసీజీ, కార్డియా ఫిట్నెస్, తదితర పరీక్షలు చేపట్టారు. వివిధ రకాల ఆపరేషన్లకు 20 మందిని ఎంపిక చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు. శిబిరానికి తోడ్పడిన వారందరితో పాటుగా, వైద్యులను ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, మంజులవాణి, రాము, మూర్తి, రామాంజి, అశోక్, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఒలింపిక్స్ దినోత్సవం



కరాటే పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ ఒలింపిక్స్ దినోత్సవాన్ని కదిరి కరాటే ఫైటర్స్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు నిర్వహించిన కరాటే విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో తోడ్పతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ షెక్షావలితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం అనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

టమాట రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- పుంజుకుంటున్న ధరలు
- ప్రస్తుతం బాక్సు ధర రూ.1000 పైనే
- బయట రాష్ట్రాల్లో తగ్గిన సరుకు
- ప్రస్తుతం పిందె దశలో ఉన్న పంటకు మంచి ధరలుండే అవకాశం

ధర్మవరం రూరల్: ధరలున్నప్పుడు రైతుల వద్ద సరుకుండదు, అలాగే సరుకున్నప్పుడు ధరలు వుండవు. ఇది కొన్నేళ్లుగా సత్యసాయి, అనంతపురం జిల్లాలోని రైతుల పరిస్థితి. ఇటీవల 30 కిలోల టమాట బాక్సు ధర మార్కెట్‌లో రూ.1000లకు పైగా ధర పలికింది. నాలుగు రోజులుగా అనంతపురం మార్కెట్‌లో టమాటకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో వచ్చి టమాట పంటను అధిక ధరలకు కొనుగోలు చేసి ఆ ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఎండలకు టమాట దిగుబడి పెద్దగా లేకపోవడంతో ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కోత దశలో ఉన్న తోటలకు డిమాండ్ వచ్చే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

విడతల వారిగా పంటల సాగు

ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో చాలా మంది రైతులు విడతల వారీగా టమాట పంటను సాగు చేశారు. సుమారు 2 వేల హెక్టార్లకు పైగా టమాట పంటను మొదటి దశలో సాగు చేశారు. అయితే కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు మరో 3 వేల హెక్టార్లలో టమాట పంటను సాగు చేయడానికి పొలాలను సిద్ధం చేసుకొని నారు కోసం నర్సరీలలో నారుకు ఆర్డర్లు పెట్టుకుంటున్నారు. తొలి దశలో నాటిన పంట ఎండలకు పెద్దగా దిగుబడి రాలేదని రైతులు అంటున్నారు. అదే విధంగా రెండో విడతలో సాగు చేసిన టమాట పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. చీడపీడలు, అధిక వర్షాలు రాకుంటే రెండోదశలో సాగు చేసిన పంటలో మంచి దిగుబడులతో పాటు అధిక ధరలు వచ్చే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు.

టమాట ధరలకు రెక్కలు

ధర్మవరం డివిజన్‌లో పండించిన పంటను అనంతపురం, మదనపల్లి మార్కెట్‌లకు తరలిస్తుంటారు. ఆదివారం మదనపల్లి మార్కెట్‌లో 30 కేజీల బాక్సు మొదటి రకం కాయలు రూ.1600 ధరలు పలికాయి. రెండవ రకం కాయలు రూ.1300 నుంచి రూ.1200 వరకు ధరలు పలికాయని రైతులు చెబుతున్నారు. అదే విధంగా అనంతపురం కక్కలపల్లి మార్కెట్‌లో 14 కేజీల బాక్సు రూ.700 దాకా పలికింది. గోలి కాయలు(చిన్న కాయలు) రూ.300 నుంచి రూ.400 వరకు ధరలు పలికాయని రైతులు చెప్తున్నారు. అనంతపురంలో 32 టమాట మార్కెట్‌లున్నాయి. అయితే ఒకటి, రెండు మార్కెట్లకు మాత్రమే సరుకు వస్తోంది మరో నెల రోజులు గడిస్తే దాదాపుగా అన్ని మార్కెట్‌లకు సరుకు వస్తుందని వ్యాపారస్తులు అంటున్నారు. ప్రస్తుతం టమాట పండించిన రైతులకు కాసుల వర్షం కురుస్తుందని రైతులు అంటున్నారు.



రేగాటిపల్లి సమీపంలో పూత దశలో ఉన్న టమాట తోట

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

తాడిమర్రి: దివంగత కేంద్రమంత్రి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక వీరభద్రయ్యస్వామి గుడి ఆవరణలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు కార్యక్రమంలో పాల్గొన్న వారికి అన్నదానం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గంగులకుంట సురేష్‌రెడ్డి, మండల అధ్యక్షులు సాకే పోతలయ్య, మండల కార్యదర్శి నిడిగల్లు రామాంజి, కుసుకుంట్ల శ్రీనివాసులు, దేవర రాము, చంద్ర పాల్గొన్నారు.

బత్తలపల్లి: భావితరాల కోసం బలిదానం చేసిన వ్యక్తి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని ధర్మవరం అసెంబ్లీ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కావేటి మల్లికార్జున, బీజేపీ నాయకులు కోటి సూర్యప్రకాష్‌బాబు కొనియాడారు. ఆదివారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు వేరువేరుగా కార్యక్రమాలను నిర్వహించారు. బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో మాజీ కన్వీనర్ కావేటి మల్లికార్జున, కోటి సూర్యప్రకాష్‌బాబు తన స్వగృహంలో కార్యక్రమాలను నిర్వహించారు. బీజేపీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, బత్తలపల్లి ఉప సర్పంచు కోటి గోపీనాథ్, నాయకులు సాకే గోపాల్, కప్పల సుదర్శన్, బిల్లే సురేష్, తాడిమర్రి మండల కన్వీనర్ పోతలయ్య, నిడిగిల్లు రామాంజనేయులు, దినేష్‌కుమార్, వెంకటేష్, మనోజ్, దళిత మోర్చా నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 71వ వర్ధంతిని బీజేపీ నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి స్వగృహంలో నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తలుపుల గంగాధర్, కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింతా శరత్ కుమార్, నాయకులు జెట్టి అంజనేయులు, సాధిక్, రమేష్ బాబు, అడ్వొకేట్ హరి, గోవర్ధన్, నందిశెట్టి బాబు, శంకర్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలు ముందుకు తీసుకెళ్తామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ 71 వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఒకేచట్టం ఒకే ప్రజా, ఏక్‌భారత్ అనే నినాదంతో అందరిని ఒక తాటిపై తీసుకొచ్చారన్నారు. ఆయన ఆశయాలు ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు జ్యోతి ప్రసాద్, బాలగంగాధర్, సాకేరామాంజి, నారాయణ, సత్యమయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ పోతలయ్య

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన పోతలయ్య ఆదివారం ద్విచక్రవాహనంలో పట్టణానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్కెట్‌యార్డు సమీపంలో బత్తలపల్లి వైపు వెళ్లే కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పోతలయ్య కాలు విరిగిపోయి చేతులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పైకి మినరల్... లోపల జనరల్!



- మినరల్ వాటర్ పేరిట నకిలీ విక్రయాలు
- నాణ్యతా ప్రమాణాలకు పాతర
- ఒకే బ్రాండ్ పేరుతో అక్షరాలు మార్చి మోసం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

దుకాణాలు, హోటళ్లు, చాయ్ కేఫ్‌లు ఇప్పుడు ఎక్కడ చూసినా సాధారణ నీటికి బదులు మినరల్ వాటర్ బాటిళ్లనే ప్రజలు ఎక్కువగా కొంటున్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు అక్రమార్కులు మినరల్ వాటర్ పేరిట దందా చేస్తున్నారు. రకరకాల బ్రాండ్ల పేర్లలోని అక్షరాలను మారుస్తూ ఒరిజినల్‌లకు ఏమాత్రం తీసిపోకుండా ప్యాకింగ్ చేసి అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు.

హిందూపురం: నియోజకవర్గంలో నకిలీ మినరల్ వాటర్ బాటిళ్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్ ఇతర రద్దీ ప్రాంతాల్లో తమ దందా సాగిస్తున్నారు. ఒరిజినల్ బ్రాండ్ల రంగుల్లో కేవలం బ్రాండ్ పేరులోని ఒక్క అక్షరాన్ని మార్చేస్తూ జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. చాలా మంది విషయం తెలియక అసలైందే అనుక్కొని ఆ నీటిని తాగేస్తున్నారు.

వందకు పైగా యూనిట్లు

హిందూపురం పట్టణ పరిసరాల్లో 100కు పైగా మినరల్ వాటర్ యూనిట్లు నీటి పంపింగ్ మోటర్ల ద్వారా ట్యాంకర్లలో నింపి రిటైల్‌గా విక్రయిస్తున్నారు. నీటిని శుద్ధి చేస్తారా? లేదా? అనే సంగతి ఎవరికీ సరిగ్గా అర్థం కాదు. వాటర్ ప్లాంట్లు లేకుండా బోర్ల నీటిని నింపి మినరల్ పేరిట విక్రయించే ట్యాంకర్లు ఎన్నో ఉన్నాయి. నీటి అక్రమాల వ్యవహారంపై నిగ్గు తేల్చాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, ఆహార కల్తీ నిరోధకశాఖ, ఫుడ్ కంట్రోలర్ అధికారులు, మున్సిపల్‌శాఖ సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో వారి దందాకు అడ్డే లేకుండా పోయింది.

నిబంధనలు ఇలా...

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే తొలుత బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్)కు దరఖాస్తు చేసుకోవాలి. లేకపోతే ఐఎస్‌ఐ (ఇండియన్ స్టాండర్డ్ ఇన్‌స్టిట్యూట్) ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ముంబై, చెన్నైలో ఉన్న ఆ సంస్థలు తమ బృందాన్ని పంపి నీటి నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేస్తారు. బోరు పాయింట్ నుంచి వచ్చే నీళ్లను ల్యాబ్ పంపి అన్ని రకాల పరీక్షలు చేస్తారు. ఆపైన అనవసర లవణాలను తీసివేసి ఆరోగ్యదాయకమైన నీటిని తయారు చేయాల్సి ఉంటుంది. అన్ని సంతృప్తికరంగా ఉంటేనే ఐఎస్‌ఐ మార్క్ సర్టిఫికెట్ జారీచేస్తారు. ఈ ప్లాంటుకు సంబంధిత అనుమతి, స్ట్రక్చర్ తదితరాలను మాత్రం పంచాయతీ, మున్సిపల్ అధికారులు పరిశీలిస్తారు. ఈ అనుమతులు తతంగమంతా వాటర్ ట్యాంకర్లు, బ్యాటళ్ల సిద్ధం చేసే ప్లాంట్ వద్ద కనిపిస్తే ఒట్టు. మరికొందరు నామమాత్రంగా చెన్నైలో బయోహెర్బల్ సంస్థ నుంచి సర్టిఫికెట్లను తెచ్చుకొని నీటివ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమాలపై జిల్లా యంత్రం దృష్టిసారించి ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారులకు పట్టదా?



హిందూపురంలో ఎటు చూసినా డూప్లికేట్ మినరల్ బాటిళ్ల దందా సాగుతోంది. నాణ్యత ప్రమాణాల గురించి అడిగితే ఎవరో ఇచ్చారు ఇష్టముంటే కొను లేకపోతే వదిలై అంటున్నారు. ఇలాంటి నీటిని తాగితే అనారోగ్య సమస్యలు తప్పవు. ఇంత జరుగుతున్న జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు.

– ఉదయ్‌కుమార్, హిందూపురం

నిర్వాహకులపై చర్యలు తప్పవు



నకిలీ వాటర్ బాటిళ్ల విక్రయాలపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లు వ్యాపారాలు, ట్యాంకర్లతో నీటి విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇదే విషయం కౌన్సిల్‌లో అధికారులకు కూడా తెలియజేశాము. ఈ వ్యవహారంపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– ఇంద్రజ, మున్సిపల్ చైర్‌పర్సన్

క్రీడలతో మానసికోల్లాసం

బత్తలపల్లి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ మధు ఆచారి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద అన్నారు. ఆర్డీటీ క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా ఫౌండర్ విన్సెంట్ ఫెరర్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విన్సెంట్, మాంచో, విశాల్, అన్నే జట్లు మధ్య లీగ్‌లు జరగ్గా విన్సెంట్, మాంచో జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం మాంచో టీం, విన్సెంట్ టీం జట్ల మధ్య క్రికెట్ ఫైనల్ పోటీలను నిర్వహించారు. ఆర్డీ ప్రమీల టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రికెట్ పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరగాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన విన్సెంట్ జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 9 వికెట్లు కొల్పోయి 172 పరుగులు చేసింది. అనంతరం 173 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన మాంచో జట్టు 23.1 ఓవర్లలో 6 వికెట్లు కొల్పోయి 173 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ జయరామ్‌కు దక్కింది. విజేతకు, రన్నర్ జట్లుకు బహుమతులను అందించారు. ఈ టోర్నమెంట్‌కు సహకారం అందించిన నడిమింటి షేక్షావలి, క్రీడాకారులకు దుస్తులను అందించిన పామాల రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ జయరాం, ఆర్గనైజర్లు శంకర్‌దవాన్, చందు, ఇర్ఫాన్, అప్పస్వామి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఆర్డీటీ అధికారులు, జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ మధు ఆచారి తదితరులు

హంపన మృతి తీరని లోటు



సంతాపం తెలుపుతున్న కసాప పదాధికారులు

పావగడ: సాహితీ వేత్త డాక్టర్ కమల హంపన మృతి సాహిత్య లోకానికి తీరనిలోటని స్థానిక కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. డా కమల హంపన (88) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా పట్టణంలోని గురుభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఉత్తమ సాహితీ వేత్తల్లో ఒకరైన హంపన సమకాలీన కన్నడ సాహిత్యంలో గుర్తింపు పొందారన్నారు. ఇటీవల జరిగిన 71వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షురాలిగా కీర్తి ప్రతిష్టలు పొందారన్నారు. కార్యక్రమంలో కసాప కార్యదర్శి ఈ.నారాయణప్ప, మద్దుబండె విశ్వనాథ్, అంతరగంగ శంకరప్ప, చన్నబసవణ్ణ, హోమా నాగరాజు, ఇమ్రాన్, రిజ్వాన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ



మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవితను ఆదివారం పెనుకొండ ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఎస్పీ మాధవరెడ్డి కలిశారు. ఈసందర్భంగా ఆయన మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతలపై కాసేపు చర్చించారు.

గాయపడిన టీడీపీ కార్యకర్త మృతి

గాండ్లపెంట: మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఫ్లెక్సీ కడుతూ కిందపడి గాయపడిన టీడీపీ కార్యకర్త మృతి చెందాడు. వివరాలు.. ఈ నెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆపార్టీ కార్యకర్త మేకల నారాయణ(47) ఫెక్సీలు ఏర్పాటు చేస్తుండగా విద్యుతాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిని వ్యక్తిని అదే రోజు 108 వాహనంలో కదిరి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి బెంగుళూరు తర్వాత తమిళనాడులోని వేలూరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఐదు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కార్యకర్త మృతికి ఆ పార్టీ మండల నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



గోవిందరాజులు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల పంచాయతీ హరియాన్ చెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న హెచ్‌ఎం గోవిందరాజులు గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గోవిందరాజులు దంపతులను పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలకు శ్రీకారం

అనంతపురం కల్చరల్: ఏటా అంగరంగ వైభవంగా సాగే పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవానికి మరోసారి ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటూ ఆధ్యాత్మిక సందడిని రేపే ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. స్థానిక అరవిందనగర్‌లోని సర్వేశ్వరాలయంలో ఉదయం మహాగణపతి, నవగ్రహ సమేత పందిరి పూజలు, ప్రధాన కలశస్థాపన, ఉత్సవ మూర్తులకు రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి చేపట్టారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220727, 9912220726, 9010593486